షెడ్యూల్ ఇచ్చారు.. జాబితా మరిచారు

- మంగళవారం రాత్రయినా విడుదలకాని డీఎస్సీ అభ్యర్థుల ఫైనల్ లిస్ట్‌లు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన కొన్ని గంటల్లోనే స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ అభ్యర్థుల మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో పెడతామని పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. మంగళవారం నుంచే ఎస్ఏ, ఎస్జీటీ అభ్యర్థులకు 1:3 మెరిట్ ప్రకారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. అన్ని ఏర్పాట్లు చేశామని ఘనంగా ప్రకటించారు. కానీ ఫలితాలు విడుదలై 48 గంటలు దాటినా డీఎస్సీ అభ్యర్థుల మెరిట్ లిస్ట్ మాత్రం ఇవ్వలేదు. దీంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల విద్యాశాఖ, డీఈవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. షెడ్యూల్ మేరకు సర్టిఫికెట్ల పరిశీలన ఎందుకు చేపట్టడంలేదని ప్రశ్నిస్తున్నారు. అభ్యర్థుల నుంచి ఒత్తిడి రావడంతో మంగళవారం రాత్రి 9 గంటల తర్వాత 1:3 మెరిట్ ప్రకారం ఎస్జీటీ అభ్యర్థుల జాబితా అందుబాటులో ఉంచుతామని చెప్పారు. బుధవారం ఎస్ఏ మెరిట్ లిస్ట్ ఆన్‌లైన్‌లో పెడతామని వెల్లడించారు.

ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డు

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' అందజేస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (యూడీఏ), ఎల్ఆర్ఎస్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ధాన్యం కొనుగోళ్లు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను యుద్ధప్రతిపాదికన పరిష్కరించాలని ఆదేశించారు. డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు దసరాలోగా అప్పగించాలని ఆదేశించారు. వరద ప్రభావిత 29 జిల్లాలకు రూ.3 కోట్ల చొప్పున, ఖమ్మం, సూర్యాపేట, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు రూ.ఐదు కోట్ల చొప్పున, మున్సిపాలిటీలకు రూ.కోటి, కార్పొరేషన్లకు రూ.2 కోట్ల చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు.

స్వాతంత్ర్య పోరాట దిక్సూచి మహాత్మాగాంధీ

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): అహింసనే ఆయుధంగా మలచిన సమరయోధుడు, మానవాళికి మానవత్వం నేర్పిన మహనీయుడు మహాత్మాగాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. బుధవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య పోరాట దిక్సూచి అని కొనియాడారు. అదేవిధంగా మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను సీఎం రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు.

ఆడబిడ్డలకు శుభాకాంక్షలు

పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ ఫుడ్స్ ధరల సవరణకు కమిటీ

మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఫుడ్స్‌లో వినియోగిస్తున్న ముడిసరుకు ధరల సవరణకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీం, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీతో కలిసి సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన పోషకాహారం అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చేపపిల్లల పంపిణీపై గందరగోళం

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): చేప పిల్లల పంపిణీ తేదీపై గందరగోళం నెలకొన్నది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి చేప పిల్లల పంపిణీని ప్రారంభించనున్నట్టు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మత్స్యశాఖ మాత్రం ఈ నెల 4వ తేదీ నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించడం గమనార్హం. దీంతో జిల్లా అధికారులు, రాజకీయ నేతల్లో గందరగోళం నెలకొన్నది. మరోవైపు కేవలం 9 జిల్లాల్లోనే చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ చర్యలు చేపట్టింది. ఆ తర్వాత 19 జిల్లాల్లో చేపట్టనుంది.

అన్నీ వాళ్లకు చెప్పి చేయాల్నా?

- హైకమాండ్‌పై ముఖ్యమంత్రి రుసరుస
- క్యాబినెట్ భేటీలో చిటపట
- గత 20న హైడ్రాపై తీవ్రవాదోపవాదాలు
- ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై వివరణ అడిగిన అధిష్ఠానం
- ఖర్గేకు పరామర్శ నెపంతో ఢిల్లీకి రేవంత్
- హైడ్రాపై సీనియర్లను కలిసి వివరణ

హైదరాబాద్, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హైడ్రా కూల్చివేతలపై సొంత పార్టీలోనే వ్యతిరేకత రావడం, తమకే కాకుండా అధిష్ఠానం పెద్దలకు కూడా చెప్పకుండా హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చివేయడంపై తనను ప్రశ్నించిన మంత్రులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. అంతేకాదు, 'అన్నీ అధిష్ఠానానికి చెప్పి చేయాల్నా' అని ధిక్కార స్వరం వినిపించినట్టు సమాచారం. ఈ విషయం కూడా అధిష్ఠానానికి చేరడంతో తీవ్రంగా పరిగణించిన ఢిల్లీ పెద్దలు రేవంత్‌ను పిలిపించినట్టు తెలిసింది. అందుకనే ఆయన ఆగమేఘాల మీద ఢిల్లీ వెళ్లారని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. పేదల ఇండ్లను హైడ్రా బుల్డోజర్లతో తొక్కిస్తున్న రేవంత్‌రెడ్డిపై ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధితులు శాపనార్థాలు పెడుతుంటే చివరికి సొంత పార్టీ అధిష్ఠానం, మంత్రులు సైతం రేవంత్ చర్యల్ని సమర్థించడం లేదు. ఇందులో భాగంగానే సీఎంను ఢిల్లీకి పిలిచిన కాంగ్రెస్ పెద్దలు స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వగా, ఇక్కడి మంత్రులేమో సీఎంపై మాటల దాడికి దిగినట్టు తెలిసింది. అసలు ఈ హైడ్రా ఎందుకు? ఈ కూల్చివేతలు ఏమిటంటూ నిలదీసినట్టు సమాచారం. ఇప్పటికే ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని ప్రజలు ఆగ్రహంగా ఉంటే, ఇప్పుడు ఈ కూల్చివేతలతో పార్టీ, ప్రభుత్వం ఏం కావాలని నిలదీసినట్టు తెలిసింది. నీ ఒక్కడి వల్ల దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి కూల్చివేత పార్టీగా పేరొస్తున్నదని, ఇంతవరకు చేసింది చాలని, ఇక ఆపేయాలంటూ వార్నింగ్ ఇచ్చిట్టు తెలిసింది.

క్యాబినెట్‌లోనూ హైడ్రా రచ్చ.. సీఎం వర్సెస్ మంత్రులు

సెప్టెంబర్ 20న ప్రభుత్వం క్యాబినెట్ సమావేశం నిర్వహించింది. దీని ఎజెండా పైకి ఒక విధంగా చెప్పగా లోపల మాత్రం హైడ్రానే ప్రధాన అంశంగా చర్చ జరిగినట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డిపై పలువురు సీనియర్ మంత్రులు మాటల దాడికి దిగినట్టు సమాచారం. హైడ్రాపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సై అంటే సై అనేదాకా వెళ్లినట్టుగా సమాచారం. ఉత్తర తెలంగాణకు చెందిన ఓ మంత్రి లేచి అసలు హైడ్రా ఎందుకు?, ఈ కూల్చివేతలు ఎందుకని నిలదీసినట్టు చెప్తున్నారు. త్వరలో జీహెచ్ఎంసీ ఎన్నికలు పెట్టుకొని బుద్ధి ఉన్నవాడెవడైనా పేదల ఇండ్ల కూల్చివేతలు పెట్టుకుంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని, రుణ మాఫీ చేయలేదని పార్టీపై, ప్రభుత్వంపై జనాలు పీకల్లోతు కోపంతో ఉన్నారని, ఈ తలనొప్పి సరిపోదన్నట్టు ఈ కూల్చివేతల గోల ఏంటని నిలదీసినట్టు సమాచారం. అసలు ఏ ఉద్దేశంతో హైడ్రాను ఏర్పాటు చేశారు? ఏం చేయదలుచుకున్నారో చెప్పాలని సీఎంను ప్రశ్నించినట్టుగా తెలిసింది. దీనిపై సీఎం స్పందిస్తూ మీరెందుకు అంతలా బాధపడుతున్నారని మంత్రిని ఉద్దేశించి అన్నట్టు చెప్పుకొంటున్నారు. దీనిపై సదరు మంత్రి స్పందిస్తూ 'హైదరాబాద్‌తో నాకు సంబంధం ఉంది. సంబంధం గల మంత్రిని కావడంతో ఈ హైడ్రా గోల ఏందంటూ చాలా మంది నన్ను అడుగుతున్నారు. నేను వాళ్లకు ఏం సమాధానం చెప్పాలో మీరే చెప్పండి' అని ఎదురు ప్రశ్నించినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. పేదోడికి ఇండ్లు ఇచ్చే పార్టీగా పేరున్న కాంగ్రెస్, ఇప్పుడు అదే పేదోడి ఇల్లు కూల్చే పరిస్థితి రావడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారట. ఎలాగూ పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే పరిస్థితిలో లేం, ఉన్న ఇండ్లను కూల్చివేయడం ఏంటని నిలదీసినట్టు తెలిసింది. మీరు ఇలాగే చేస్తే రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వం ఏం కావాలని మంత్రి ప్రశ్నించారట.

నాకు చెప్పండి.. ఢిల్లీకి మోత ఎందుకు?

మంత్రి ఎదురుదాడితో కంగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి సదరు మంత్రిని శాంతింపజేసే ప్రయత్నం చేస్తూ 'ఈ విషయం గురించి మీరు నాతో ఎప్పుడైనా మాట్లాడారా?. ఏదైనా సమస్య ఉంటే నాకు చెప్పండి. అంతే గానీ ఢిల్లీకి ఎందుకు మోస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. కల్పించుకున్న మరో మంత్రి అసలు హైడ్రా గురించి మీరు మాతో ఎప్పుడైనా చర్చించారా? కూల్చివేస్తున్నట్టు చెప్పారా? అసలు హైడ్రా ద్వారా ఈ పని చేస్తే ఏ విధంగా ఉంటుందనే అభిప్రాయాన్నైనా తీసుకున్నారా? మీరు మాతో మాట్లాడనప్పుడు మేము మీకెలా చెబుతాం అని అడ్డం తిరిగినట్టు సమాచారం. ముఖ్యమంత్రిని తొలుత వ్యతిరేకించి ఇప్పుడు మద్దతుగా కనిపించే ఓ దక్షిణ తెలంగాణ మంత్రి స్పందిస్తూ 'మీరు అందరితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటే ఈ సమస్య ఉండేది కాదు కదా, మీరొక్కరే నిర్ణయాలు తీసుకుంటూ ఇప్పుడు వీళ్లను తప్పు పడితే లాభమేంటి' అని అన్నారట. సీఎం మాట్లాడుతూ.. తనతో ఎప్పుడూ మనసు విప్పి మాట్లాడని మీరు.. ఈ రోజు మాట్లాడినట్టుగానే ఎప్పుడూ మాట్లాడొచ్చుగా అని అన్నట్టు తెలిసింది. ఇక్కడేమో తనతో ఏదీ మాట్లాడరని, కానీ అన్ని విషయాలను ఢిల్లీకి మోస్తారని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. తనను వ్యతిరేకిస్తున్న దక్షిణ తెలంగాణకు చెందిన మంత్రి వైపు చూస్తూ రేవంత్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

అన్నీ వాళ్లకు చెప్పి చేయాల్నా?

అన్ని విషయాలను ఢిల్లీకి మోస్తున్నారంటూ మంత్రులను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పార్టీకి అధిష్ఠానం ఉంది కాబట్టి ఇక్కడ జరిగే అంశాలను అధిష్ఠానానికి తెలియజేయాల్సిన బాధ్యత తమపై ఉన్నదని, అందుకే అవసరమైన విషయాలను చెప్తామని స్పష్టం చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ అధిష్ఠానంపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. 'అన్నీ వాళ్లను అడిగి చేయాల్నా. అన్నీ వాళ్లకు చెప్పే చేయాల్నా. మీరు చెబితే చెప్పుకోండి ఏమైతది? అయ్యేదేం లేదు. వాళ్లు(అధిష్ఠానం) ఏం చేస్తరు? ఏం చేయలేరు?' అని ధిక్కార స్వరం వినిపించడంతో మంత్రులు ఒక్కసారిగా విస్తుపోయినట్టు తెలిసింది. సీఎం వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసిన దక్షిణ తెలంగాణ మంత్రి ఒకరు 'అవును, అన్నీ వాళ్లకు చెప్పాల్సి అవసరం లేదు. కానీ కనీసం ఇక్కడున్న వాళ్లకైనా చెప్పాలి కదా. మాతో అయినా చర్చించాలి కదా. మనం మనం చర్చించుకొని సరైన నిర్ణయం తీసుకుంటే అధిష్ఠానానికి చెప్పాల్సిన అవసరం రాదు. కానీ ఇక్కడ ఏకపక్షంగా తప్పుడు నిర్ణయం తీసుకుంటే కచ్చితంగా అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తుంది' అని గట్టిగానే చెప్పినట్టు తెలిసింది. ఏదైనా ఉంటే నాకు చెప్పండి అంతేగానీ ఇది ఏం బాగాలేదు' అంటూ అధిష్ఠానానికి వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి కటువుగా మాట్లాడినట్టుగా తెలిసింది.

రాహుల్ వ్యతిరేకిస్తే.. నువ్వు ఎగదోస్తావా?

కూల్చివేతలు ఎల్లకాలం ప్రజలకు గుర్తుండవని, వచ్చే ఎన్నికల నాటికి అందరూ మర్చిపోతారంటూ రేవంత్ చెప్పడంపై అధిష్ఠానం పెద్దలు మరింత ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రజలు అంత పిచ్చోళ్లేమీ కాదని, మరి ఇప్పుడు ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో పరిస్థితి ఏంటని ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. హైడ్రా కూల్చివేతలకు రాహుల్‌గాంధీ మద్దతు ఉన్నట్టుగా ప్రచారం చేయడంపైనే ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ చేస్తున్న బుల్డోజర్ న్యాయాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదని, కానీ ఇందుకు పూర్తి విరుద్ధంగా పార్టీ పాలసీకి వ్యతిరేకంగా తెలంగాణలో బుల్డోజర్ కూల్చివేతలు చేయడం ఏంటని నిలదీసినట్టు తెలిసింది. బుల్డోజర్ న్యాయాన్ని వ్యతిరేకిస్తున్న రాహుల్‌గాంధీ.. తెలంగాణలో మాత్రం బుల్డోజర్ వ్యవహారాన్ని సమర్థించినట్టు నీకు ఎవరు చెప్పారని నిలదీసినట్టు సమాచారం. 'ఇదేమైనా ప్రాంతీయ పార్టీనా? కాంగ్రెస్ పార్టీ అని మీకు తెలియదా? అలాంటప్పుడు అన్నీ మాకు చెప్పి చేయాల్నా అనే ప్రశ్న ఎందుకు వేశారు. మీరేమైనా సుప్రీం అనుకుంటున్నారా' అని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

నీ వల్లే ఇతర రాష్ట్రాల్లో పార్టీకి ఇబ్బందులు

హైడ్రాపై క్యాబినెట్ సమావేశంలో జరిగిన రచ్చ, సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలన్నీ అధిష్ఠానానికి చేరినట్టుగా తెలిసింది. దీంతో పాటు హైడ్రా వ్యవహారం రోజు రోజుకి పార్టీకి నష్టం చేస్తుండడం, హైడ్రా బాధితులకు అండగా బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు పర్యటనలు విజయవంతం కావడం, పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాధితులు శాపనార్థాలు పెడుతుండడం, సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం పెరిగిపోవడంతో అధిష్ఠానం పెద్దలు రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్టుగా కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దీంతో వెంటనే ఢిల్లీకి రావాల్సిందిగా రేవంత్‌రెడ్డిని ఆదేశించినట్టు తెలిసింది. 'త్వరలోనే ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తెలంగాణ మాదిరిగా కూల్చివేస్తదంటూ అక్కడి ప్రత్యర్థి పార్టీలు ప్రచారం చేస్తున్నాయి. వెంటనే హైడ్రాను, కూల్చివేతల్ని ఆపేయండి' అని తీవ్రస్థాయిలో హెచ్చరించినట్టు తెలిసింది.

మూసీ కూల్చివేతలపై కోర్టుకెళ్తా

- పైసా తీసుకోకుండా కేసు నడిపిస్తా
- అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తా
- కాంగ్రెస్ నేత మధుయాష్కీ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ పేరుతో రేవంత్‌రెడ్డి సర్కార్ తలపెట్టిన కూల్చివేతలపై అధికార కాంగ్రెస్ పార్టీలోనే భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అన్యాయంగా కూల్చివేతలకు దిగితే బాధితుల పక్షాన కోర్టుకెళ్తానని పీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక న్యాయవాదిగా బాధితులపై రూపాయి ఖర్చు వేయకుండా కోర్టులో కేసు వేసి ప్రజలకు అండగా నిలుస్తానని చెప్పారు. మంగళవారం ఆయన కొత్తపేట, చైతన్యపురి డివిజన్లలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి, ఆ ప్రాంతవాసులతో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పేందుకు ప్రయత్నించారు. పిల్లాపాపలతో నిశ్చింతగా నిద్రపోవాలని, ఇక్కడి ఇండ్లపై గడ్డపార దిగకుండా తనది గ్యారెంటీ అని చెప్పారు. ఒకవేళ అన్యాయంగా ఇండ్లు కూలగొడితే అధిష్ఠానమే జోక్యం చేసుకుంటుందని, ఈ విషయాన్ని తాను కూడా అధిష్ఠానం దృష్టికి తీసుకుపోయే స్థాయిలో ఉన్నానని పేర్కొన్నారు. మూసీ కూల్చివేతల విషయంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. మూసీకి ఎఫ్టీఎల్, బఫర్ జోన్ నిర్ణయించేందుకు అధికారుల వద్ద ఒక ప్రతిపాదన లేదని, ఏ సంవత్సరం నుంచి మూసీ హద్దులు పరిగణనలోకి తీసుకుంటారనే విషయాన్ని కూడా చెప్పడం లేదని మండిపడ్డారు. నోటీసులు ఇవ్వకుండా, ప్రజల ఆమోదం లేకుండా ఏ నిర్మాణాన్నీ కూల్చడానికి వీల్లేదని తెగేసి చెప్పారు. ఒక వేళ ప్రభుత్వం ఇండ్లను కూల్చాలంటే మన్మోహన్‌సింగ్ హయాంలో తీసుకొచ్చిన భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ విలువకు నాలుగింతల పరిహారం బాధితులకు చెల్లించాల్సిందేనని స్పష్టంచేశారు. మూసీకి ఇరువైపులా రిటైనింగ్‌వాల్స్ నిర్మించి కూడా సుందరీకరణ చేసుకోవచ్చని సూచించారు. నదికి ఇరువైపులా ఇండ్లు ఎక్కువ ఉన్న ప్రాంతాలను కాకుండా, ఖాళీ స్థలాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

300 రోజులు.. 73,495 కోట్ల అప్పు

- రుణాలతోనే నడుస్తున్న రేవంత్ పాలన
- ఆర్బీఐ నుంచి మరో 2,000 కోట్ల అప్పు
- సెప్టెంబర్‌లోనే రూ.4,500 కోట్ల రుణం



హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు రాష్ట్ర ప్రజలపై మరింత రుణభారం మోపుతున్నది. రుణాలతోనే ప్రజాపాలన సాగిస్తున్నది. నిరుడు డిసెంబర్ 7న అధికార పగ్గాలు చేపట్టిన నాటినుంచి నేటివరకు అంటే.. 300 రోజుల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.73,495 కోట్ల అప్పు చేసింది. మంగళవారం ఆర్బీఐ నుంచి మరో రూ.2వేల కోట్ల అప్పు తీసుకున్నది. రూ.1,500 కోట్ల విలువైన ఒక బాండ్‌ను 15 ఏండ్ల కాలానికి, రూ.500 కోట్ల విలువైన బాండ్‌ను 18 ఏండ్ల కాలానికి రాష్ట్ర ఆర్థికశాఖ భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ)కు జారీచేసి ఈ రుణం పొందింది. ఈ విషయాన్ని ఆర్బీఐ ప్రకటించింది. ఇప్పటివరకు ఒక్క ఆర్బీఐ నుంచే రూ.48,618 కోట్ల అప్పు సమీకరించుకున్నది. సెప్టెంబర్ 3న రూ.2,500 కోట్లు, 10న 1,500 కోట్లు, 17న రూ.500 కోట్లు.. ఇలా నెల వ్యవధిలోనే రూ.4,500 కోట్ల రుణం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మంగళవారం మరో రూ.2వేల కోట్ల అప్పు తీసుకున్నది. ఇలా ప్రతి నెలా రూ.5 వేల నుంచి 6 వేల కోట్ల విలువైన బాండ్ల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుంచి అప్పులు తీసుకుంటున్నది. ఆర్బీఐ నుంచి సేకరించే రుణాలు సరిపోక.. వివిధ కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలకు ప్రభుత్వం అడ్డగోలుగా గ్యారెంటీలు ఇస్తున్నది. అధికారంలోకి వచ్చిన ఎనిమిదిన్నర నెలల్లోనే రూ.25 వేల కోట్ల మేర గ్యారెంటీలు ఇచ్చింది. అప్పులను ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టు కోసమో, విప్లవాత్మక పథకం కోసమో ఖర్చు చేస్తాయి. కానీ, ఈ ప్రభుత్వం తొమ్మిది నెలల్లో అలాంటి దేమి చేయకపోవడంపై ఆర్థిక నిపుణులు మండిపడుతున్నారు.

- పింఛన్ల పెంపుకోసం బీడీ కార్మికుల ర్యాలీ

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను రూ.4,016కు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో బీడీ కార్మికుల ర్యాలీ నిర్వహించారు. పింఛన్లు పెంచకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. – రామారెడ్డి

ఏఈవోలపై డిజిటల్ కత్తి

- క్రాప్‌సర్వే కోసం సర్కారు మొండిపట్టు
- విధుల్లో నిర్లక్ష్యమని ఏఈవోలపై ఉక్కుపాదం

కరీంనగర్, అక్టోబర్ 1 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): డిజిటల్ క్రాప్ సర్వే చేయడం తమ వల్లకాదని రాష్ట్రవ్యాప్తంగా ఏఈవోలు నెత్తినోరు మొత్తుకుంటున్నా.. ప్రభుత్వం వారి మాటలను పెడచెవి పెట్టి ఉక్కుపాదం మోపుతున్నది. వారి విజ్ఞప్తులను పక్కనపెట్టి క్రమశిక్షణ చర్యలను చేపడుతున్నది. రాష్ట్రంలో ఉన్న 2,604 మంది ఏఈవోలు ఇప్పటికే 49 రకాల విధులు నిర్వహిస్తూ డిజిటల్ క్రాప్ సర్వే తమకు తలకుమించిన భారమని ముక్తకంఠంతో చెబుతున్నారు. ఇవేమీ పట్టించుకోని ప్రభుత్వం సర్వేలు చేయకుండా విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొంటూ వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారితో 59 మంది ఏఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లాలో 40 మంది ఏఈవోలు యాప్ డౌన్‌లోడ్ చేసుకోలేదని గత నెల 27, 28 తేదీల్లో గైర్హాజరు వేసి ప్రభుత్వానికి పంపించారు. మరికొన్ని జిల్లాల్లోనూ చర్యలకు ఉపక్రమించినట్టుగా తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఏఈవోల ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని టీఎన్జీవో రాష్ట్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ చెప్పినట్టు తెలుస్తున్నది.

గర్భిణులు, బాలింతలకు కుళ్లిన గుడ్లు

- వాంతులు, వికారంతో తినలేక అవస్థలు
- వారిలో లోపిస్తున్న పోషక విలువలు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): పోషక విలువలు అందించడం కోసం అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలతోపాటు చిన్నారులకు అందించే గుడ్ల సరఫరాలో కాంట్రాక్టర్లు కక్కుర్తి పడుతున్నారు. కుళ్లిన, గడువు ముగిసి పాడైపోయిన గుడ్లను సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా లబ్ధిదారుల్లో పోషక విలువలు లోపించి నీరసించిపోతున్నారు. నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. అసలు దోషులను గుర్తించి చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సంఘం రాష్ట్ర నాయకురాలు నల్ల భారతి డిమాండ్ చేస్తున్నారు.

మూసీ బాధితులు ఆందోళన చెందొద్దు

ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

మలక్‌పేట, అక్టోబర్ 1: మూసీనది పరివాహక ప్రాంతం బాధితులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాము అండగా ఉంటామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల చెప్పారు. మంగళవారం ఆయన మూసానగర్, శంకర్‌నగర్‌లోని మూసీ రివర్ బెడ్‌లో ఎమ్మార్డీసీ చేపట్టిన కూల్చివేతల ప్రాంతాల్లో పర్యటించారు. పలువురు బాధితులు తమ గోడును ఎమ్మెల్యేకు వినిపించారు. మూసీ బాధితులందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు ఇప్పించే బాధ్యత తనదేనని తెలిపారు. పునరావాసం కల్పించిన తర్వాతే నివాసాల తొలగింపు ఉంటుందని పేర్కొన్నారు.

అక్రమ సర్వేపై ఎంఐఎం ఫిర్యాదు

మూసీ నది తీరంలో అక్రమ సర్వే చేస్తున్నారంటూ ఎంఐఎం ప్రతినిధుల బృందం మంగళవారం ఎంఎయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్‌ను కలిసింది. ఎంఐఎం ఎమ్మెల్యేల బృందంతో వెళ్లి మూసీలో నిర్వహించిన అక్రమ సర్వేపై తీవ్ర అభ్యంతర వ్యక్తం చేశారు.

పునరావాసం కల్పించండి

పేదలకు పునరావాసం కల్పించాకే మూసీ ప్రక్షాళన చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ బాలమల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లో కలకొండ కాంతయ్య అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడా బాబుల జోలికి పోకుండా పేదలపై ప్రతాపం చూపడం అన్యాయమని మండిపడ్డారు.

కాంగ్రెస్ హామీలకు 300 రోజులు

మొదటిపేజీ తరువాయి...

చూసి ప్రజలు ఆ పార్టీకి ఓట్లేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి అక్టోబర్ ఒకటో తేదీనాటికి 300 రోజులైనా హామీలు అమలు కావడం లేదు. పాత ఆర్టీసీ బస్సుల్లో కష్టాల మధ్య మహిళల ఉచిత ప్రయాణం ఒక్కటే అమలవుతున్నది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు అనేక బాలారిష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఈ మూడు మినహా మి